

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

**మర్నాడు ఉదయం** ఆర్కాన్సస్ చూద్దాం అని బయలుదేరాము. పిజ్జాహట్‌లో భోజనం చేసి మౌంట్ ఓ జార్క్ చూడ్డానికి వెళ్ళాము. స్నో పడడంతో నడుచుకుంటూ కాక కారులోనే డ్రైవ్ చేసాము. ఆ స్నో చూసి నేను చాలా భయపడి వద్దని చెప్పినా మిగతావాళ్ళు వినిపించుకోలేదు. "ఇంత దూరం వచ్చి చూడకుండా వెళ్ళిపోవడం ఏంటి?" అంటూ ఒప్పించారు.

కేవలం పదినిమిషాల్లో మౌంట్ ఓ జార్క్ చేరుకున్నాము. ఒక పక్కన కారు ఆపి చూసాము. ఎంతో బాగుంది. పైనుండి చూస్తే అంతా తెల్లగా కనపడింది. పొదవాటి చెట్లు, వాటి నిండా మంచు, సూర్యుడులేని ఆకాశం. జన సంచారం అస్సలు లేదు. ప్రపంచంలో మేం తప్ప ఎవరూ లేరనిపించింది. వాళ్ళంతా ఫోటోలు తీసుకున్నారు. నేను మాత్రం

మైమరిచిపోయి ప్రకృతిని ఆస్వాదిస్తూ ఉండిపోయాను. అలా ఎంతసేపు ఉన్నానో కానీ పాప పిలిచినప్పుడు వాళ్ళతో కలిసాను. మనసు ఎంతో ప్రశాంతంగా అనిపించింది. ప్రకృతి అన్నిటినీ అందంగా, ఆహ్లాదంగా మార్చి మనసును నయం చేస్తుంది. పార్వతి పెళ్లయ్యాక దేవదాసు ఇలాంటి చోటకి వస్తే ప్రకృతే అతన్ని నయం చేసి ఉండేది.

"నేను వద్దన్నా తెచ్చినందుకు థాంక్స్" అన్నాను.

"థాంక్స్ అట. నెక్స్ట్ ఇంకేం చెప్తావు?" పాప నవ్వింది.

అలా దారి పొడుగూతా చాలా చోట్ల ఆగుతూ వెళ్ళాము. అక్కడినుండి మార్క్ ట్వైన్ నేషనల్ ఫారెస్ట్‌కి బయలుదేరాము. అది దాదాపు గంట ప్రయాణం. దారిలో నేను టెంత్ క్లాసులో చదివిన నాయని కృష్ణకుమారిగారు రాసిన కాశ్మీర దర్శనం గురించి చెప్పాను. అది రామ్ కి కూడా గుర్తుందని చెప్పాడు. అందులో తను రాసిన కాశ్మీరులో అందరూ ఆజానుబాహులు, అక్కడ ఆపిల్ పళ్ళ గురించి చాలాసేపే చర్చ జరిగింది. ఒకదాని నుండి ఒకటిగా సంభాషణ సాగుతూ కాశ్మీర్‌లో జరిగిన యుద్ధాలనుండి ఆజానుబాహుడైన ఎన్.టి.రామారావు వరకు మాట్లాడుకున్నాము.

మా అందరికీ అన్నిటి గురించి మిడి మిడి జ్ఞానం ఉందని అర్థమైంది. వెంటనే ఫోన్ తెరిచి లైబ్రరీలో ఉన్న కాశ్మీర్ హిస్టరీకి చెందిన పుస్తకాలను వెతికాను. ఈలోగా ఫారెస్ట్‌ని చేరాము.

దారి చిందరవందరగా ఉన్నా ఇందాకటి మౌంటెన్ అనుభూతి వల్ల నేను అభ్యంతరం చెప్పలేదు. దురదృష్టవశాత్తూ ఫారెస్ట్‌లో కొన్ని చోట్ల స్నో వల్ల మూసేసామని బోర్డు పెట్టుంది. ఉన్నవి చూసి వెళదాం అని అనుకున్నాము. రచయిత మార్క్‌ట్వైన్ గురించి ఆ పేరు వచ్చిందని పల్లవి అంది.

ఆయన అక్కడ ఎంతో కాలం ఉండడం వల్ల ఆ పేరు పెట్టారట. ఆయన రాసిన 'గిల్డెడ్ ఏజ్ ఎ పొలిటికల్ గ్రస్ హాపర్' ఆ ఏరియాలో అప్పటి సొసైటిపై రాసిన పేరడి అని చెప్పింది.

"నిజంగానే, సృష్టిస్తున్నావా?" పాప అడిగింది.

"నిజమే. కావాలంటే చూసుకో" బదులిచ్చింది.

"నీకెలా తెలుసు?" రోషణ్ అడిగాడు.

"చదివిందేమో?" అన్నాను.

"ఏ, ఛీ. లేదు. నా మొహం చదివా" వెంటనే అంది.

"అదేంటి మరి? అలా ఎలా చెప్పావు? అబద్ధమా?" అడిగాను.

"లేదు. మీరు జవహర్‌లాల్ నెహ్రూ, ఆపిల్స్ గురించి మాట్లాడుతున్నప్పుడు నేను గూగుల్ చేసాను" అంది.

అందరం నవ్వాము. ఇందాకటిలానే ఫోటోలు తీసుకున్నాము. ఇందాకటంత వేగంగా కాక చలికి తట్టుకోలేనంతసేపటిదాకా అక్కడే కాలక్షేపం చేసాము. అక్కడి తెల్లటి చెట్లు నాకు అన్నిటికన్నా ఆకర్షణీయంగా అనిపించాయి.

"ఫారెస్ట్ కదా, ఏనిమల్స్ ఏమైపోయి ఉంటాయి?" పల్లవి అడిగింది.

"వింటర్‌లో కొన్ని హైబర్నేట్ అవుతాయి, ఇంకొన్ని మైగ్రేట్ అవుతాయి" రవి అన్నాడు.

"మైగ్రేట్ అంటే రోడ్డుమీద నడుచుకుంటూ వేడి చోటకి హిచ్ హైక్ చేస్తాయా?" రోషణ్ ఎగతాళి చేసాడు.

"లేదురా. ఫారెస్ట్ వాళ్ళే చూసుకుంటారు" రవి అన్నాడు.

అక్కడ గడ్డ కట్టిన లేకుపై నడవాలని కుతూహలం కలిగింది. అది బరువుకి విరుగుతుందని పాప భయపడింది. నేను ఫోన్‌లో టెంపరేచర్ చూసి ఆ చలికి నీరంతా గడ్డకట్టిందని, కేవలం పై పొర కాదని చెప్పాను.

పాప, రోషణ్ భయపడ్డారు. నేను, పల్లవి, రవి ఆ లేక్ మీద నెమ్మదిగా నడిచాము. కొంతదూరం వెళ్ళాక రవి స్కేటింగ్ చేసాడు. నేనూ అదే చేసాను. ఆగేందుకు బ్యాలెన్స్ కుదరక దాదాపు పడబోయాను. పాప పట్టుకోవడంతో నేను బ్రతికిపోయాను. పాపం రవి మాత్రం కిందపడ్డాడు. అది చూసి పల్లవి నిదానంగా వెనక్కి వచ్చింది. మాతోపాటు రవి కూడా నవ్వాడు కానీ మిగతా దారంతా కుంటుతూనే నడిచాడు.

"సన్‌లైట్ ఉంటే నువ్వు పడిన దెబ్బకి అది విరిగిపోయి 'బావగారు బాగున్నారా'లో బ్రహ్మానందంలా తయారయ్యేవాడివి" అన్నాను.

అంతా నవ్వుకుంటూ తిరిగి కారు దగ్గరకి వెళ్ళాము. వచ్చే దారిలో తెలియలేదుకానీ వెళ్ళేప్పుడు మాత్రం చలికి చాలా ఇబ్బంది పడ్డాను. కాస్త నడిచాక "కొంచెం సేపు ఆగండి నాకు చాలా చలిగా ఉంది" అన్నాను.

"కాళ్ళు నొప్పిగా ఉన్నాయా?" రోషణ్ అడిగాడు.

"లేదు."

"అయితే నడుస్తూ ఉండు. ఆగితే చలి పెరుగుతుంది" అన్నాడు. దాంతో ఆగకుండా నడుస్తూ సాగాము. వచ్చినప్పుడు ఎంత వేగంగా అనిపించిందో వెళ్ళేప్పుడు అంత దూరంగా అనిపించింది.

"తప్పిపోయామా?" పాప అడిగింది.

"లేదు. ఇదే దారిలో వచ్చాము" పల్లవి అంది.

"ఎలా తెలుసు?" అడిగాను.

"చుట్టుపక్కల చూస్తే తెలుస్తుంది" అంది.

"అన్ని చోట్లా అవే చెట్లు. ఈ చెట్లే చూసామని ఎలా తెలుసు? రోషణ్ అడిగాడు

రెండు నిమిషాల నిశబ్దం తరవాత, "హారర్ సినిమాల్లో ఇలానే జరుగుతుంది తెలుసా? ఫ్రెండ్స్ కలిసి ఎక్కడికో వెళ్ళి ఎంజాయ్ చేస్తారు. ఆ తరవాత దారి తప్పిపోతారు. చీకటి పడుతుంది. హంతకుడు ఒకరి తరవాత ఒకర్ని ఘోరంగా చంపేస్తాడు" రవి అన్నాడు.

నాకు వెంటనే భయం వేసింది.

"ఇదేం సినిమాకాదు" పల్లవి అంది.

"సినిమాలో కారెక్టర్లు కూడా అదే అనుకుంటాయి. అయినా అమెరికాలో సీరియల్ కిల్లర్లు చాలామందే ఉంటారు. ఇలాంటి నేషనల్ పార్క్‌లో హత్యలు చాలా జరిగాయి. దానిమీద రకరకాల పాడ్‌కాస్ట్‌లు కూడా చేసారు. నీకు తెలీదా?" అడిగాడు.

నాకు చలితోపాటు భయంతో కూడిన వణుకు మొదలైంది.

"అది అంతా నాన్‌సెన్స్" పల్లవి అంది.

"కావాలంటే గూగుల్ చెయ్యి ఇక్కడే చాలామంది హత్యలు జరిగి ఉంటాయ్ కూడా" అన్నాడు.

పల్లవి ఫోన్ తీయబోతే "వద్దు. చూస్తే భయం ఎక్కువ అవుతుంది" రోషణ్ అన్నాడు.

"ఇక్కడ ఎవరూ భయపడట్లేదు" పల్లవి బదులిచ్చింది.

"అవును. నాకేం భయంలేదు. నా పేరులోనే రాముడున్నాడు" పాప అంది.

వెంటనే నేను తప్ప అందరూ నవ్వారు.

"నీకు భయమేస్తుందా?" నన్ను అడిగారు.

"లేదు చలేస్తుంది" అబద్ధం చెప్పాను.

ఈలోగా కారు కనబడింది. వెంటనే అందరం పరుగుతీసాము. మా అందరికీ భయంగా అనిపించిందని అర్థమై అంతా నవ్వుకున్నాము. కారు హీటర్ ఆన్ చేసి వేడిగా అయ్యేంత వరకూ అక్కడే ఉన్నాము. అమ్మమ్మ చెప్పినట్టు ప్రకృతి పగలు ఎంత అందంగా ఉంటుందో రాత్రి అంత భయంకరంగా ఉంటుందని అర్థమైంది. పాటలు వింటూ అక్కడినుండి బయలుదేరాము.

అంత నడిచేసరికో, లేక చలివల్లో తెలీదు కానీ అందరూ నిశబ్దంగా ఉన్నారు. ముందుగా రోషణ్ డ్రైవ్ చేసాడు. ఒకరు డ్రైవ్ చేసేప్పుడు కనీసం ఒకరు మాట్లాడుతూ ఉండాలని ఒప్పందం పెట్టుకున్నాము.

రోషణ్ డ్రైవ్ చేస్తున్నప్పుడు రవి పడుకోవాలని, అలానే రవి డ్రైవ్ చేసేప్పుడు రోషణ్ పడుకోవాలని నిశ్చయించుకున్నాము. అంతా చీకటిగా మారడంతో నాకు భయంవేసి మెలుకువగానే ఉన్నాను. ఫారెస్టు దాటి ఊరిలోకి

వచ్చేదాకా మెలకువగా ఏదో ఒకటి మాట్లాడుతూ ఉన్నాను. ఊళ్ళో లైట్లు చూసాక హమ్మయ్య అనిపించింది. పల్లవి, పాప, రోషణ్‌తో మాట్లాడుతుండగా నేను తెలియకుండానే నిద్రలోకి జారిపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story